చెరువులో కలుషిత నీరు

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని కొమ్మూరులో చెరువులో గేదలు పడి నీరు కలుషితం చేస్తున్నాయి. కాపలాదారు లేకపోవటం ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ కాపలాదారు నియమించి గేదెలు పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్యం అధ్వాన్నం

విశాలాంధ్ర-కాకుమాను : గ్రామాలలో పలు వీధులలో చెత్తాచెదారం పేరుకొని దోమల నిలయంగా మారింది. అయినా పంచాయతీ తీరు మారటం లేదు. పారిశుద్ధ్యం పడకేసింది. అధికారులు స్పందించి వీధుల వెంట ఉన్న చెత్తాచెదారని తొలగించాలని ప్రజలు కోరుచున్నారు.

కానుక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-కాకుమాను : పాఠశాల పునఃప్రారంభం రోజున మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్టును పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారి బి.శైలజ అన్నారు. పాఠశాలకు చేరిన జగనన్న కిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్ష కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-కాకుమాను : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకుమాను గ్రామ శివారులో ఉన్న పేద కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణ కిట్లను పంపిణీ చేశారు. తహశీల్దార్ ప్రసాదరావు రెడ్ క్రాస్ సొసైటీ బృందం పాల్గొన్నారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

విశాలాంధ్ర-కాకుమాను : అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని కాకుమాను పీహెచ్‌సీలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో పనిచేస్తున్న నర్సులను శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవి ప్రసాద్, ముద్దు ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ అబ్దుల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్పాపురంలో గ్రామసభ

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని అప్పాపురంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శరత్ బాబు, ఆడిటర్స్, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, ఏపీవోలు, సర్పంచ్ పొందుగల ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కాకుమాను: ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన పంటలను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధర పొందాలని ఏవో కిరణ్మయి అన్నారు. బోడిపాలెం గరికపూడి తలగా యపాలెం, బికేపాలెం గ్రామాల్లో తడిచిన మొక్కజొన్న పంటను పరిశీలించారు.

పండిన పంటకు మద్దతు ధర

విశాలాంధ్ర-కాకుమాను: దెబ్బతిన్న మొక్కజొన్న పంటకు మార్కెట్ ఫెడ్ ద్వారా రూ.1962 లకు కొనుగోలు చేయనున్నట్లు ఏవో కిరణ్మయి అన్నారు. తెల్ల జొన్న పంటలను పరిశీలించిన తర్వాత పంట నష్టపరిహారం కోసం పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కనీసం 33శాతం పంట నష్టం ఉంటే ప్రతి రైతు నమోదు చేయాలని తెలిపారు. ఆమె వెంట బిపిఏలు సౌమ్య, సిబ్బంది ఉన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కరవు

విశాలాంధ్ర-కాకుమాను: జగనన్న కాలనీలో సమస్యలు దర్శనమిస్తున్నాయి. మురుగు సమస్య పారుదల లేక వర్షానికి రోడ్ల అధ్వాన స్థితిలో ఉన్నాయి. మెటీరియల్ తోలాలన్నా గుంటలో బండ్లు ఇరుక్కుపోయి లబ్ధిదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సరిచేయాలని కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న అధికారులు

విశాలాంధ్ర-కాకుమాను: గ్రామ శివారులో గత కొన్ని సంవత్సరాలుగా నివసిస్తున్న నిరాశ్రయులకు తహశీల్దార్ జయప్రసాదరావు ఆధార్ కార్డులు ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరికి ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు.

వృధాగా పోతున్న తాగునీరు

విశాలాంధ్ర-చేబ్రోలు: వేసవి కాలంలో తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంగా చేబ్రోలు గ్రామంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీలో తాగునీరు పైపు లైన్‌ల లీకులతో వృధాగా పోతున్నాయి. మరో ప్రక్కన గ్రామంలో ప్రజలకు నీరందని పరిస్థితి నెలకొంది. అనేక సార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన మంచినీటి పైపు లైన్‌లకు మరమ్మతులు చేయకపోవటంతో గత కొంత కాలం నుంచి తాగునీరు వృధాగా పోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్‌లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

104ఉద్యోగులు ధర్నా

విశాలాంధ్ర-చేబ్రోలు: జీతాలు చెల్లించాలని 104 ఉద్యోగులు నిరసన ధర్నా చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా 104గుంటూరు జిల్లా అధ్యక్షులు సత్యరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత 3 నెలల నుంచి 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలను కూడా దశల వారిగా అందించాలన్నారు. తమ డిమాండ్‌లు పరిష్కరించకపోతే దశల వారిగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డీఈఓ ఉదయ్ కుమార్, 104 ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు సిటి, వెంగళరావు నగర్ 7/3వ లైను, డోరు నెం. 7-6-1124రు కాపురస్తులు లేటు పోలే ఏసురత్నం గారి కుమారుడు పోలే సుందరరావు (సెల్: 9908421976) గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిట గుంటూరు గ్రామ డి.నెం.556/1 నందు 100 చదరపు గజముల స్థలము కలదు. సదరాస్తి నా క్లయింటు పేరిటకు శ్రీ గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయంలో విక్రయ దస్తావేజు నెం.8369/1990 రుగా రిజిష్టరు కాబడిన రీత్యా సంక్రమించినది. సదరు దస్తావేజు నెం.8369/1990 ఒరిజినల్‌ను ది.14-08-2022న గుంటూరు ఆర్టీవో ఆఫీసు వద్ద జిరాక్సు తీయించుకునేందుకు వస్తుండగా పోగొట్టుకున్నారు. ఇప్పటికే ఈ విషయమై నల్లపాడు పోలీసుస్టేషన్ నందు ఫిర్యాదు చేసి, పోలీసు సర్టిఫికెట్ కూడా పొందడమైనది. దరిమిలా సదరాస్తిని నా క్లయింటు తన కుమారుడైన పోలే విమల్ మనోహర్‌కు దఖలు పర్చేందుకు సిద్ధపడియున్నారు. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినా లేక సదరు ఆస్తి విషయమై గానీ మరియు దస్తావేజు విషయమై గానీ ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 15 రోజులలోగా తెలియజేయగలరు.

డా॥ వై.ఎన్.వి. కిషోర్‌కుమార్
హైకోర్టు అడ్వకేట్, సాంబశివపేట 2వ లైను, కొత్తపేట, గుంటూరు, సెల్: 74166 44666

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: టీడీపీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతు లను ఆదుకొనని వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరస నగా ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. దీక్షలో పాల్గొన్న శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ చేతికొచ్చిన అకాల వర్షాలతో పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసీపీ పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పంట నష్టంపై ఇప్పటివరకు ముఖ్యమంత్రి కానీ, అధికారులు కానీ స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత సంవత్సరం తెగుళ్ళు సోకి మిర్చి రైతులు నష్టపోతే ప్రభుత్వం ఆదుకోలేదని, ఈ సంవత్సరం కూడా మిర్చి, మొక్కజొన్న, పసుపు రైతులు నష్టపోతే ఆదుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య మాట్లాడుతూ చంద్రబాబు రైతుల కోసం పడుతున్న కష్టం చూసైనా ప్రభుత్వంలో కదలిక రావాలని కోరారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ఎన్నికల ముందు 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. తూర్పు ఇంచార్జి నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రైతులకు భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నరసరావుపేట ఇంచార్జి చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రైతు బిడ్డలకు కన్నీరు తెప్పించిన ఈ వైసీపీ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్, మన్నవ మోహన కృష్ణ, దామినేని శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమతా, వేములకొండ శ్రీనివాస్, రావిపాటి సాయికృష్ణ, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు 'ఆచార్య ఆత్రేయ'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు వారి హృదయాల్లో చిరస్మరణీయమైన పాత్ర ఆచార్య ఆత్రేయది అని ప్రముఖ సంగీత విద్వాంసులు, గాయకులు విఎస్ఎన్ మల్లీశ్వరరావు అన్నారు. ప్రేమ కవిగా, మనసున్న కవిగా కీర్తించబడ్డ ఆచార్య ఆత్రేయ ఆంధ్రుల గుండెల్లో అజరామరంగా నిలిచిపోయారని కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆత్రేయ జయంతి వేడుకలు శుక్రవారం గాయనీ, గాయకులు నడుమ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆత్రేయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లీశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినీ గేయ రచయితల్లో మనసు గీతాల మధుర కవి ఆచార్య ఆత్రేయది ఒక అంతులేని కథ అని అన్నారు. రచయిత్రి ఎవికె సుజాత మాట్లాడుతూ నాటక, సినిమా పాటల రచయితగా నాలుగు దశాబ్దాల పాటు తనదైన ప్రత్యేక శైలిని ఆత్రేయ ప్రదర్శించారన్నారు. డాక్టర్ రామకృష్ణ, రామ కృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి, రాజశేఖర్, మదుసూధనరావు, కోటేశ్వరరావులు ఆత్రేయ పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, పోతురాజు తదితరులు ఉన్నారు.

14 నుంచి హనుమత్ జయంతి మహోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శ్రీ కంచి కామకోటి పీఠ మారుతి దేవాలయ ప్రాంగణమునందు ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు హనుమత్ జయంతి మహోత్సవాలు జరగనున్నట్లు దేవాలయ కమిటీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14న ఉదయం 7 గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం శ్రీ శారదా రామలింగేశ్వర భజన సమాజం వారిచే భక్తి సంకీర్తన, 15న ఉదయం 7 గంటల నుంచి ఆంజనేయస్వామికి మాన్య పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం నుంచి లక్ష తులసి పూజ నిర్వహిస్తారని పేర్కొన్నారు. 16న ఉదయం 10 గంటలకు శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామివారి కళ్యాణ మహోత్సవం, 17న హనుమన్ మండల దీక్షలు, ఇరుముడి ప్రదక్షిణములు, దీక్షా విరమణ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు దివ్యంగా నిర్వహించబడతాయన్నారు. అన్నప్రసాద వితరణ కూడా చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని శ్రీనివాస్ కోరారు.

అర్జీల పరిష్కారంపై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జగనన్నకు చెబుదాం ద్వారా ప్రజలు అందించిన అర్జీలకు సాధ్యమైనంత వేగవంతంగా మెరుగైన పరిష్కారం అందించేలా ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్ (పీయంయు) లోని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి , సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి తో కలసి జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారం పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్ లో నియమించిన వివిధ శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కే.చంద్ర శేఖర రావు, ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్‌లో నియమించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చుక్కల భూములు నిషేధిత జాబితా నుండి తొలగింపు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం కోసం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల జిల్లాలో 601.36 ఎకరాల చుక్కల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుండి తొలగించి జిల్లాలోని రైతులకు లబ్ధి చేకూర్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు జిల్లా కావలి నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చుక్కల భూములకు సంపూర్ణ హక్కును కల్పించే కార్యక్రమం ప్రత్యేక ప్రసారంను కలక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, డీఆర్ఓ చంద్ర శేఖర రావుతో కలసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో కలక్టరేట్ పరిపాలన అధికారి పూర్ణ చంద్రరావు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై విద్యాశాఖ కమిషనర్ ఆగ్రహం

విశాలాంధ్ర-చేబ్రోలు: ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న జగనన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయకపోవటంతో ఉపాధ్యాయుల పై విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నారాకోడూరు లోని ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న జగనన్న కిట్లు పంపిణీలో కొంత మంది విద్యార్థులకు ఇవ్వకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యాయులు సక్రమంగా పని చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరుల పాల్గొన్నారు.

ఇళ్ళ పట్టాల పంపిణీకి మద్దతుగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర-తుళ్ళూరు : ఇళ్ల పట్టాల పంపిణీకి మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వ ర్యంలో శుక్రవారం రాజధానిలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. స్వయంగా కోర్టు ఇళ్ల పట్టాల పంపిణీకి అడ్డు చెప్పలేమని తీర్పు ఇస్తే టీడీపీ నేతలు న్యాయస్థాన ఉత్తర్వులను అవమానిస్తున్నారన్నారు. ఏకంగా లేఅవుట్ పనులను అడ్డుకుంటూ అధికారులను దుర్భాషలాడుతూ దాడులు చేస్తున్నారంటే వీళ్ళు రైతులా.. టీడీపీ గుండాలా? అని ప్రశ్నించారు. ఇళ్ల పట్టాల పంపిణీకి మద్దతుగా వైసీపీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ చేయనున్నట్టు తాటికొండ నియోజకవర్గ వైసీపీ నేత శృంగారపాటి సందీప్ అన్నారు. శుక్రవారం ర్యాలీకి అనుమతి కావాలని వైసీపీ నేతలు తుళ్లూరు పోలీసులను కోరారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి గృహనిర్బంధం

విశాలాంధ్ర-గుంటూరు : ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రబీ సీజన్లో పండించిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని మొక్కజొన్న, పసుపు పంటలకు ఎటువంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమం తలపెట్టిన సందర్భంగా ఆ కార్యక్రమానికి వెళ్ళనీయకుండా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్‌ను గృహనిర్బంధం చేసిన పోలీసులు.

ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాలు

విశాలాంధ్ర, తెనాలి : శకపురుషుని శతజయంతి మహోత్సవాల సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలిలోని పెమ్మసాని థియేటర్లో సంవత్సరంపాటు జరుగనున్న ఎన్టీఆర్ ఉచిత సినిమా ప్రదర్శనలో భాగంగా నేడు దేశోద్ధారకులు చిత్రం ప్రదర్శించబడింది. ప్రముఖ పౌరాణిక, నాటకరంగ కళాకారుడు దేశబోయిన శ్రీనివాసరావును మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కళలకు నిలయమైన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం ఈ ప్రాంతానికే గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో ఎక్కువ మంది కళాకారులు తయారు కావాలని, గ్రామ గ్రామాన ప్రదర్శనలిస్తూ ప్రజలను చైతన్య పరచాలని హితవు పలికారు. కార్యక్రమంలో వెంకట్, శ్రీనివాసరావు, వెంకట పూర్ణచంద్, చుక్కపల్లి మధుబాబు, సుంకర హరికృష్ణ, రమాదేవి, రజని, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం తప్పని సరి అని మెల్బార్ వైద్యులు డాక్టర్ యస్.విజయకుమార్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని జీసెస్ క్రైస్ట్ గ్లోరీ అండ్ కేర్ మినిస్ట్రీ ఆర్గనైజర్ పాస్టర్ మేరుగ అబ్రహాము ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్రహాము మాట్లాడుతూ మన పెద్దలకు ఉన్న ఆరోగ్యం మనకు ఉండడం లేదని అన్నారు. సమయానికి మంచి శాఖాహారం, సరైన వ్యాయామం తప్పని సరిగా ఉండాలని సూచించారు. మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారత్ కో ఆర్డినేటర్ ఆనంద్ పాల్, ఐసిటి వాలంటీర్లు, ఫెసిలిటేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

దొండపాడు, నెక్కల్లులో రైతుల తిరుగుబాటు

విశాలాంధ్ర-తుళ్ళూరు : దొండపాడు, నెక్కల్లులో రైతులు తిరుగుబాటు చేస్తున్నారు. దొండపాడు, నెక్కల్లు ఎస్-3 జోన్లలో శుక్రవారం రైతులు నిరసనకు దిగారు. ఇళ్ల స్థలాలు పనుల కోసం సీఆర్డీఏ సిబ్బంది వచ్చారు. జేసీబీ, ప్రొక్లయినర్లతో పనులు చేయటానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే పనులను అడ్డుకుని వాహనాలను రైతులు వెనక్కి పంపారు. అధికారుల తీరును నిరసిస్తూ పెట్రోల్ బాటిళ్లు పట్టుకుని మహిళా రైతుల నిరసనగా దిగారు. పోలీసులు, రైతులు మధ్య పెనుగులాటలో మహిళా రైతులపై పెట్రోల్ పడింది. పెట్రోల్ మీద పడటంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కాళిమాత ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి, శివాజీచౌక్‌లో శుక్రవారం కాళిమాత దేవాలయం కమిటి ఛైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి నెల 2వ శుక్రవారం కాళిమాత ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కామేశ్వరి, అపర్ణ, యర్రా శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వర్లు, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లు ఇవ్వాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో రోడ్ల విస్తరణ జరిగిన ప్రాంతాల్లో నిబంధనల మేరకు టిడిఆర్ బాండ్లు ఇవ్వడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏటి అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులు వసూళ్ళ తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఏసిపిల వారిగా ఈ నెలాఖరు నాటికి వసూళ్ళ నూరు శాతం జరిగేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రీ సర్వే వేగవంతం చేయాలని, కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటేమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్ట్ కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏ.సి.పి. అశోక్ కుమార్, టి.పి.ఎస్.లు పాల్గొన్నారు.

'ది కేరళ స్టోరి' సినిమా రద్దు చేయాలి

విశాలాంధ్ర-పొన్నూరు : గడిచిన కొన్ని రోజుల క్రితం విడుదలైన ది కేరళ స్టోరీ చిత్రంలో దేశంలోని కుల మతాల మధ్య చిచ్చుపెట్టే కల్పిత కథను సృష్టించి విడుదల చేసిన సినిమాను వెంటనే రద్దు చేయాలని పొన్నూరు అంబేద్కర్ సెంటర్లో తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘ నాయకులు ఆందోళన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, ప్రముఖ న్యాయవాది షేక్ బాజీ సాహెబ్, విప్లవ గేయ రచయిత దేవరకొండ శ్రీనివాసులు తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ 32 వేల మంది హిందూ యువతులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చి ఉగ్రవాద సంస్థ అయిన ఐసిస్‌లో చేర్చబడుతున్నారని ఒక కల్పిత కథనంతో ఆ చిత్ర దర్శకుడు సుదీప్ తోసేన్ చిత్రీకరించడాన్ని వారు ఖండించారు. చిత్ర విడుదలను ఆంధ్రప్రదేశ్‌లో నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే ఈ చిత్రాన్ని తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రంలో నిషేధం ఉందని చెప్పారు. ది కేరళ స్టోరీస్ సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు ఇటీవలే గుజరాత్‌కు సంబంధించి జాతీయ నేర గణాంకాల సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం గుజరాత్‌లో కనబడకుండా పోయిన 42 వేల మంది యువతులపై సినిమా తీసే దమ్ము ధైర్యం ఉందా అని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, ఆటోనగర్ మాజీ యూనియన్ ప్రెసిడెంట్ ఉస్మాన్ మేస్త్రి, ఆటోనగర్ సభ్యులు జిలాని, బాబు మేస్త్రి, అఖిలపక్ష నేతలు షేక్ బాజీ సాహెబ్, పఠాన్ ఫైరోజ్ ఖాన్, షేక్ జానీ భాష, ఇస్మాయిల్, భక్షి, మెమన్ భాష, సోహెల్, పఠాన్ ఫైజుల్లా ఖాన్, కాలేషా, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం: రైతులు పండించిన పంటలు దళారులు నుండి నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం మార్కుఫెడ్ ద్వారా పంటలను కొనుగోలు చేస్తుందన్నదని ఎంపిపి ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు సొసైటీ కార్యాలయంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్యలు శుక్రవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దత్తు ధర కల్పించి చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య మాట్లాడుతూ నిర్దేశించిన పద్ధతి ప్రకారం తేమ శాతం ఉంటే మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.1962 లభిస్తుందని తెలిపారు. సర్పంచ్ రంతు శ్రీనివాసరావు గ్రామ పార్టీ అధ్యక్షులు తుమాటి కబ్బారావు, రైతులు ముండ్రు రాఘవరావు, సాదినేని చిన్న వెంకయ్య నాగులపాటి ఏగిరాములు, వల్లమూడి రామకృష్ణయ్య, నాగులపాటి శ్రీనివాసరావు, గట్టుపల్లి వీరాస్వామి, ఆలపాటి సాంబశివరావు, సూరాబత్తుని కృష్ణారావు, ఏవో రామినేని రామారావు, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాద్, ఎఈఓ పూరేటి అశోక, విఎఎలు, సొసైటి సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జీవో నెం.1ను హైకోర్టు కొట్టి వేయటం ప్రజాస్వామ్య విజయమని, పౌర హక్కులు కాలరాయాలని చుసిన వైసీపీ ప్రభుత్వానికి ఈ తీర్పు చెంప పెట్టు అని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుని కాలరాయాలనుకునే నియంతలలు ఇలాంటి ఎన్ని చీకటి జీవోలు తెచ్చిన మా లాంటి ఉద్యమకారులకు చిత్తుకాగితాలతో సమానమన్నారు. కేవలం చంద్రబాబు నాయుడు 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం' లోకేష్ 'యువగళం పాదయాత్ర', జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి బస్సు యాత్రలు అడ్డుకోవటానికి తెచ్చిన దుష్ట చర్యే ఈ చీకటి జీవో అన్నారు. జీవో నంబరు 1 కు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన టీడీపీతో పాటు వామపక్షాలకు, ప్రజాసంఘాలు ముఖ్యంగా హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యంతో కేసు వేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు అభినందనలు తెలియజేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'శ్రీవివేకానంద' ప్రతిభ

విశాలాంధ్ర-తెనాలి : సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ విద్యార్థులు. యండి. అఫ్రీన్ 94% మార్కులు సాధించగా, మెహక్ ఫాతిమా 92%, ఎ.మాధురి 90.2% మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని వివేక సంస్థల అధినేత డాక్టర్ రావిపాటి వీరనారాయణ హర్షం వ్యక్తం చేశారు. పరీక్షకు హాజరైన 64మంది విద్యార్థుల్లో 62 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 22 మంది డిస్టింక్షన్‌లో పాస్ అయ్యారని చెప్పారు. ఇంగ్లీషులో నూటికి 98 మార్కుకులు, మాథ్స్‌లో 90, బయాలజీలో 95, ఫిజిక్స్‌లో 94, కెమిస్ట్రీలో 97, కంప్యూటర్స్‌లో 98 మార్కులు గరిష్ఠంగా సాధించి అన్ని సబ్జక్టుల్లో మంచి మార్కులు సాధించడం విశేషం అన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను విద్యాసంస్థల సిఈఒ వెంకట్రావ్, డైరెక్టర్ వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామరాజు, ప్రిన్సిపాల్ రమాదేవి సత్కరించారు.

సినీ నటి, నర్తకి టీనా చౌదరికి సన్మానం

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి, అమరావతి ఫ్లాట్స్‌లోని స్విమ్&ఫన్ ఆడిటోరియంలో శుక్రవారం టీనా చౌదరికి సన్మానం జరిగింది. ముఖ్య అతిథిగా సినీ దర్శకుడు దిలీప్‌రాజా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత ఉపరాష్ట్రపతి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్, తెలంగాణా రాష్ట్ర గవర్నర్, తమిళ సై, మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, కర్ణాటక గవర్నర్‌ల ముందు నృత్య ప్రదర్శన చేసి వారి అభినందనలు అందుకోవడం తెనాలికే గర్వకారణం అన్నారు. ప్రధానమంత్రి మోదీ ముందు టీనాచౌదరి నృత్య ప్రదర్శన చేయనుందని చెప్పారు. జెవియస్ విద్యాసంస్థల అధినేత జెట్టి విజయశేఖర్ మాట్లాడుతూ ఇరవైఏళ్ల వయసుకే టీనా చౌదరి ప్రముఖుల సత్కారాలు అందుకోవడం ఎందరో యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. టీనాచౌదరి మాట్లాడుతూ తన స్వస్థలంలో సత్కరించిన జెవియస్ క్రాంతి కోచింగ్ సెంటర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఈ స్థాయికి నడిపించిన దిలీప్‌రాజాకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ గిరిధర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉమాదేవి, సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ, చిలుమూరు ఎంపిటిసి అమ్మిశెట్టి ఆదినారాయణ, టివి2 న్యూస్ ఛానెల్ సిఇవో శ్రీకాంత్, మన్నె సత్యనారాయణ, లెక్చరర్లు రవి, అనిల్, శ్రీనివాసరావు, షాజహాన్, రమేష్ కేపి, అప్పారావు, విద్యార్థులు, చిన్నారులు గ్రీష్మ, తహసీన్‌లు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విజయభేరి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఏఐఎస్ఎస్ఈ (సీబీఎస్ఈ) - 2023 ఫలితాలలో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు ఆంధ్ర, తెలంగాణలో సంచలన ఫలితాలు నమోదు చేశారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బ్లూమ్స్ విద్యార్థిని ఉమాశంకర్ తారికాశ్రీ 500 మార్కులకు గాను 492 సాధించి భాష్యంకు గర్వకారణంగా నిలిచిందన్నారు. జి.మన్విత 490, కె.భవజ్ఞ 490 వంటి అత్యుత్తమ మార్కులతో విద్యార్థులు విశేష ప్రతిభ చూపారన్నారు. 475 ఆ పైగా 34 మంది, 450 ఆ పైగా 105 మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: మండల పరిధిలోని నడిం పాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ కూలీలకు మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ చేశారుజ స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కొండ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

14న 'కాలంతో పాటు' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : ప్రముఖ సాహితీ వేత్త ఎస్ఎం సుభాని రచించిన కవితా సంపుటి 'కాలంతో పాటు' పుస్తకావిష్కరణ సభ 14వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేట కొరటాల సమావేశ మందిరం(సీపీఎం కార్యాలయం)లో జరుగుతుందని గుంటూరు జిల్లా రచయితల సంఘం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవిత సంపుటి ఆవిష్కరణ సభకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవాని దేవి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. ఆత్మీయ అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, రమ్య భారతి, సంపాదకులు చలపాక ప్రకాష్ పాల్గొంటారని పుస్తక సమీక్ష సారస్వత కళానిధి డాక్టర్ వెలుటల నాగరాజ్యలక్ష్మి చేస్తారన్నారు. నగరంలోని రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు ఈ పుస్తకావిష్కరణ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా లక్షమల్లెపూల పూజ

విశాలాంధ్ర-గుంటూరు: కొత్తపేట హనుమాన్ చౌక్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ హనుమాన్ సేవా సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పంచామృత స్నాపన, 10 గంటలకు లక్ష మల్లెపూల పూజ నిర్వహించారు. ఉభయ దాతలుగా దేవరశెట్టి నాగేశ్వరరావు, తులసి వ్యవహరించారు. రాత్రి 7 గంటలకు ఆలయ మండపంలో హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా సాగింది. వందలాది మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణంతో పులకించిపోయారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. హనుమాన్ సేవా సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరువళ్లూరి సుబ్బారావు, రాధాదేవి సహకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి శ్రీనివాసరావు, శ్రీహనుమాన్ సేవా సమాజ గౌరవాధ్యక్షులు తిరువళ్లూరి సుబ్బారావు, అధ్యక్షుడు చేపల నాగేశ్వరరావు, కార్యదర్శి నరెడ్ల అనిల్ కుమార్ పలువురు సేవా సమాజ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడికి వెళ్ళనీయకుండా పోలీసులు ఆపడం అమానుషమని సీపీఐ ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వరి, మొక్కజొన్న, జొన్న, మిర్చి, పసుపు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వారి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన సీఎం కార్యాలయం ముట్టడిని అడ్డుకోవడం సరికాదన్నారు. సీపీఐ గురజాల నియోజకవర్గ ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డిని, ఏఐటీయూసీ నాయకులు వేముల వెంకటరెడ్డిని అర్ధరాత్రి హౌస్ అరెస్ట్ చేశారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-అచ్చంపేట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా పాఠశాలలలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని తర్వాత క్లాసులకు వెళ్లి ఫెయిల్ అయిన సబ్జెక్టులలో శిక్షణ పొందాలని కోరారు. నాడు నేడు పాఠశాలలు తెరిచే ఉంటాయని ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉంటారని ఎంఈఓ రాజశేఖర్ తెలిపారు.

ప్రమాదభరితంగా కార్యాలయ గదులు

విశాలాంధ్ర-అచ్చంపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు ఉండే కొన్ని గదులలో స్లాబ్ పెచ్చులూరి ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ప్రజలతో మమేకమై అధికారులు ఆఫీస్ పనులు నిర్వహిస్తుంటారని ప్రమాదవశాత్తు స్లాబ్ పెచ్చులు ఊడి పడితే తలకాయ పగిలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు తెలిపారు. ప్రమాదభరితంగా పెచ్చులూడిన గదులను మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

15 వరకు గడువు పొడిగింపు

విశాలాంధ్ర-అచ్చంపేట : విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ (12)(1)సీ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో అడ్మిషన్ కోసం, 25 శాతం సీట్లు కేటాయింపునకు గాను రెండో విడత నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వారు విడుదల చేయడం జరిగింది. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ గడువును ఈ నెల ఆరో తేదీ నుంచి 15వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఎంఈఓ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతిభ విజ్ఞానానికి దోహదం

విశాలాంధ్ర-రెంటచింతల : ప్రతి విద్యార్థి ప్రతిభతో రాణించేలా కృషి చేయాలని స్థానిక సర్పంచి పూజల పుష్పావతి రామయ్య కోరారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక పదో తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించిన బాపనపల్లి మహాలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రాజకిషోర్, ఎన్.శ్రీనివాసరావు, లూర్దమ్మ రెడ్డి పాల్గొన్నారు.

మస్తాన్‌బీని పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-క్రోసూరు : మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షరీఫ్ సతీమణి మస్తాన్‌బీని శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరామర్శించారు. అదేవిధంగా అనంతవరం గ్రామానికి చెందిన దొండేటి శ్రీనివాస్ రెడ్డి కుమార్తె అశ్విని వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వైసీపీ నాయకురాలు జలాల్ బి కుటుంబాన్ని పరామర్శించారు. శాసనసభ్యులు వెంట గఫూర్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి ఆయా గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవో రద్దు ప్రభుత్వానికి చెంప పెట్టు

విశాలాంధ్ర-రాజుపాలెం: హైకోర్టు శుక్రవారం జీవో ఒకటిని రద్దు చేయడం ద్వారా ప్రజాస్వామ్యం నిలబడిందని, ఇది జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని తెలుగుదేశం పార్టీ మాజీ ఏఎంసీ పూజల వెంకట కోటయ్య శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

మాదిపాడులో హెల్త్ క్యాంపు

విశాలాంధ్ర-అచ్చంపేట: మండలంలోని మాదిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి ఈ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పారామెడికల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు దుర్వాసన

విశాలాంధ్ర-అచ్చంపేట: మండల పరిధిలోని రోకటి గుంటపాలెం రోడ్డు వద్ద బస్టాండు సమీపంలోని ఏర్పాటుచేసిన బోరు పంపు నుంచి వచ్చే నీరు దుర్వాసన వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి అదనంగా రెండు పైపులు దింపడం ద్వారా నాణ్యమైన మంచినీరు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

విశాలాంధ్ర-విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతల తండా గ్రామంలో వైసీపీ పార్టీకి చెందిన 15 కుటుంబాలు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాచర్ల టీడీపీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి వైసిపి కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ఏ గ్రామం వెళ్లినా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గత నెలలో ద్విచక్ర వాహనం యాక్సిడెంట్ లో కాలు విరిగిన రమావత్ హేమలా కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. నేరేటి వీరాస్వామి యాదవ్, కృష్ణవేణి, పంగులూరి అంజయ్య, బాబుఖాన్, గుండాల శ్రీనివాస్ యాదవ్, పంగులూరి పుల్లయ్య,బొల్లా వెంకటేశ్వర్లుచౌదరి, మధు, సైదారావు, నారాయణ పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పని చేయాలి

విశాలాంధ్ర-రెంటచింతల : నర్సరీ యజమానులు సేవా దృక్పథంతో పని చేయాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కర్రీ సాయి మార్కొండారెడ్డి కోరారు. శుక్రవారం రెంటచింతలలో నర్సరీ యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అధిక దిగుబడులు ఆశించే అన్నదాతలు నర్సరీలు మొక్కలే సాగు చేస్తున్నారని, అందువల్ల నాణ్యమైన విత్తనాలే వాడాలని కోరారు. నర్సరీ యజమానుల సమస్యలను వెల్లడిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దుర్గి మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు ఆదూరి ఇన్నారెడ్డి, శీలం మల్లారెడ్డి, తుమ్మా ఇన్నారెడ్డి సదాశివరావు, రవీంద్రరెడ్డి పలువురు నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

రైల్వే బోర్డు మెంబర్‌గా మద్దాళి సుబ్బయ్య

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : సౌత్ సెంట్రల్ జోనల్ కమిటీ రైల్వే బోర్డు మెంబరుగా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు మద్దాళి సుబ్బయ్యను నియమిస్తూ సెంట్రల్ రైల్వే బోర్డు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల భూముల్లో గుడి కడతామంటూ బీజేపీశ్రేణుల బెదిరింపు

- ధర్నాకు దిగిన బాధితులు
- రీసర్వే చేసి అప్పజెబుతామన్న తహశీల్దార్

విశాలాంధ్ర-దాచేపల్లి : గత వారం రోజులుగా దేవాలయ భూముల పరిరక్షణ పేరిట బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్ర పన్నుతున్నట్లు ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏలెంపేట కాలనీ పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులకు ఇళ్ళస్థలాలు, కమ్యునిటీ హాలుకు కేటాయించిన భూములలో బీజేపీ శ్రేణులు కాషాయ జెండాలు పాతి, రేకులు తీసుకువచ్చి గుడి కడతామని బలవంతంగా భూములలోకి ప్రవేశించారని, అడ్డుకోబోయిన స్థానికులను దుర్భాషలు ఆడటంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. అనంతరం ఏలెంపేట కాలనీ దళితులు పోలీసు స్టేషన్ వద్దకు చేరుకోని తమస్థలం వద్దకు వచ్చి తమను దూషించిన బీజేపీ కార్యకర్తల మీద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. బాధితులతో చర్చించిన పోలీసు అధికారులు ఆ స్థలంలోకి ఎవరిని రాకుండ రాబోయే వారం రోజులు పికెట్ నిర్వహిస్తామని, ఈ విషయం తాము అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎస్సై శివనాగరాజు, ఎస్సై సంధ్యారాణి హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు నిష్క్రమించారు. అనంతరం ఈ విషయాన్ని తహశీల్దార్ వద్దకు నిర్వాసితులు వెళ్ళి తమ స్థలంలోకి తమను పోనివ్వకుండా ఎవరో అడ్డుకుంటుంటే అధికారులు ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని నిలదీశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ మంగళవారంలోపు భూమి రీసర్వే చేసి హద్దులు నిర్దేశించి భూమిని అప్పజెబుతామని హామీ ఇవ్వటంతో నిర్వాసితులు నిష్క్రమించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ అధికారులు చెప్పిన విధంగా తమ భూమి తమకు అప్పజెప్పని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగి తమ భూములు తాము రక్షించుకుంటామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సత్యానంద, సీపీఎం నాయకులు ఆంజనేయ రాజులు ప్రసంగించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాలు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 12వ తేదీ చేపట్టిన చలో సీఎం క్యాంప్ కార్యాలయం కార్యక్రమానికి వెళుతున్న సీపీఐ, రైతు సంఘాల నాయకులను అరెస్టు చేయటం దుర్మార్గ చర్య అని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు అన్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజల పక్షాన పోరాటం చేసే వామపక్ష నాయకులను ముందస్తు నోటీసులు ఇవ్వడం అరెస్టు చేయడం పోలీస్ స్టేషన్‌కు తరలించడం బాధాకరమైని మూలిగే నక్కపై తాటికాయపడిన చందంగా రైతులు పంటలు పండక గిట్టుబాటు ధర లేక అకాల వర్షాలతో మిర్చి, మొక్కజొన్న, పసుపు తడిసి ముద్దయితే ఈనాటి వైసీపీ ప్రభుత్వం రైతులకు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులకు న్యాయం చేసేంతవరకు సీపీఐ రైతు సంఘాలు పోరాటాలు నిర్వహిస్తుందని శ్రీనివాసరావు అన్నారు.

సీపీఐ, రైతు సంఘం నాయకుల అరెస్టుపై ఖండన

విశాలాంధ్ర-అమరావతి : అకాల వర్షంతో పంటలు తీవ్రంగా నష్టపోయి జీవన్మరణంతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు అండగా సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తడిసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించేందుకు బయలుదేరిన రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ రాష్ట్ర నాయకులను అరెస్టు చేయటాన్ని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోడు శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. అమరావతిలో నిర్వహించిన.నిరసన కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ రైతు నష్టపోకుండా రైతుని కాపాడేందుకు మా ప్రభుత్వం అన్ని విధాల చర్యలు చేపడుతుందని నమ్మబలికి వర్ష విపత్తు కారణంగా తడిసి నానిపోయిన పంటలను ప్రభుత్వపరంగా కొనుగోలు చేయటంలో తీవ్ర జాప్యం జరగటంతో దళారులకు అవకాశం కల్పించటమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం కారణంగా నష్టపోయిన ఆహార ధాన్యాల పంటలకు ఎకరాకు రూ.4 వేలు ఇవ్వాలని అదేవిధంగా వాణిజ్య పంటలకు రూ.75 వేలు ఇవ్వాలని, ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం అందించి రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతు పంట నిల్వల కోసం ప్రతి మండలానికి గిడ్డంగులు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-రాజుపాలెం: రాజుపాలెం మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసినటువంటి అకాల వర్షాలతో దిగుబడి తగ్గిన మొక్కజొన్న పంటను కనీస మద్దతు ధర రూ.2200లు చొప్పున ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రాజుపాలెం మండల వ్యవసాయ అధికారికి శుక్రవారం రాజుపాలెం తెలుగుదేశం పార్టీ తరపున మెమోరాండం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, పగడల శ్రీనివాసరావు, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షైక్ అల్లభక్షు, నల్లబోతుల శ్రీనివాసరావు(వాసు), వాస వెంకటేశ్వర్లు, రైతులు, కార్యకర్తలు పాల్గున్నారు.

ప్రమాదభరితంగా రహదారి

విశాలాంధ్ర-అచ్చంపేట : మండల పరిధిలోని రోకటి గుంట వారి పాలెం గ్రామానికి వెళ్లే రహదారి ప్రమాద భరితంగా నెలకొంది. తారు రోడ్డు వేసేందుకు ఏర్పాటు చేసిన కంకర రాళ్లు పైకి లేసి ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి పడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి రోడ్డును అలాగే వదిలేయడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డుని త్వరగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

విత్తన దుకాణాలపై దాడులు

విశాలాంధ్ర-వినుకొండ: మండలంలోని విత్తనాల దుకాణాలపై శుక్రవారం పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారులు కార్యాలయం నుండి టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేయడం జరిగినది. ఈ తనిఖీలో భాగంగా 2,30,000 విలువ గలిగిన విత్తనాల అమ్మకాలను నిలిపివేయడం జరిగినది .విత్తనాల స్టాకును రిజిస్టర్లో ఎంట్రీ చేయని కారణంగా అమ్మకాలను నిలుపుదల చేశారు. అదేవిధంగా రైతులకు యం.ఆర్.పి ధర కంటే ఎక్కువ ధరలకు అమ్మినట్టయితే లైసెన్సులను రద్దు చేస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఎవరైనా రైతులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని ఫిర్యాదు చేసినట్లయితే విత్తన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలియజేశారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన తర్వాత రసీదు పొందాలని తెలియజేశారు. యం.ఏ.ఓ, కే అంజి రెడ్డి, పల్నాడు డిస్టిక్ వ్యవసాయ అధికారి ఏడిఏ సిహెచ్ రవికుమార్, సుజాత, ఏవో అరుణకుమారి పాల్గొన్నారు.

వైద్య రంగంలో నర్సుల సేవలు కీలకం

విశాలాంధ్ర-శావల్యాపురం: వైద్య రంగంలో నర్సుల సేవలు ఎంతో కీలకమని వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం అన్నారు. మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నర్సుల దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్టాఫ్ నర్సు లక్ష్మి ప్రసన్న, ధనలక్ష్మి కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. సిహెచ్ఓ వెంకటయ్య, హెల్తు సూపర్వైజర్లు అర్వపల్లి సూర్యకుమార్, ఉమాదేవి, సాయిగీత, ఎంఎల్ హెచ్పిలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-మాచర్ల: ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టీ.ఐ లలో 2023-24 సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ప్రారంభమైనట్టు పల్నాడు జిల్లా కన్వీనర్ మాచర్ల ఆర్.ఐ.టీ.ఐ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ యస్.వి ప్రసాద్ బాబు శుక్రవారం తెలిపారు. ప్రసాద్ బాబు మాట్లాడుతూ దరఖాస్తులకు ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్సైట్ అందుబాటులో ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలో మాచర్ల ప్రభుత్వ ఆర్.ఐ.టీ.ఐ కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. కౌన్సిలింగ్ సమయంలో విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉందన్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు జూన్ 6వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. వివరాలకు సెల్ 9440339878 నెంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగుకు సమాయత్తం

విశాలాంధ్ర-యడ్లపాడు : లింగారావు పాలెం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో రానున్న ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ సరిత రైతులకు పలు సూచనలు చేశారు. పంట మార్పిడి, పైర్ల ఎంపిక, విత్తనాల కొనుగోలు తదితర అంశాలలో రైతులు అనుసరించవలసిన జాగ్రత్తలను వివరించారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా రసాయనిక ఎరువుల వినియోగంపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. మిర్చి రైతులకు ఖరీఫ్ సమాయత్తంలో భాగంగా ట్రైకోడెర్మా కల్చర్ను తయారు చేసుకొని దుక్కిలో వేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు రైతులకు తెలిపారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

నియంతృత్వంపై ప్రజాస్వామ్యం సాధించిన విజయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రతిపక్షాల గళం వినపడకుండా చేసేందుకు ప్రజాస్వామ్యం గొంతు నొక్కేందుకు ప్రవేశపెట్టిన చీకటి చట్టం జీవో నెంబర్ ఒకటని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.రాధాకృష్ణ విమర్శించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయడం నియంతృత్వంపై ప్రజాస్వామ్యం సాధించిన ఘనవిజయమని అన్నారు. భారతదేశాన్ని పాలించిన ఏ పార్టీ గానీ వివిధ రాష్ట్రాలలో పరిపాలన సాగించిన విభిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీలు గాని ఏనాడూ కూడా ప్రవేశపెట్టని విధంగా వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామిక జీవో నెంబర్ ఒకటి ప్రవేశపెట్టిందని రాధాకృష్ణ విమర్శించారు. ప్రజాస్వామ్యం గొంతు నొక్కి ప్రతిపక్షాల గళం వినిపించకుండా చేసేందుకు ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు రూపొందించిన ప్రజాస్వామ్య విరుద్ధమైన నియంతృత్వ జీవోను రద్దు చేయడం హర్షణీయమని అన్నారు.

పిల్ దాఖలు చేసిన రామకృష్ణకు ధన్యవాదాలు..

ఇటీవల కాలంలో రాజ్యాంగబద్ధంగా ఉన్నటువంటి హక్కులను కాలరాస్తూ ర్యాలీ, రోడ్ షోలు ఇతర కార్యక్రమాలను నియంత్రించే విధంగా జీవో నెంబర్-1ని తీసుకొచ్చింది. ఈ జీవోను హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. దీని పట్ల ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టులో పిల్ దాఖలు చేసినటువంటి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టీడీపీ నాయకులకు, ఇతర ప్రజా సంఘాల నేతలకు గిరిజన సంఘాల నుంచి హృదయపూర్వకమైనటువంటి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

రవాణా వాహనం అందజేత

విశాలాంధ్ర-వినుకొండ: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పి.యం.యం.యస్.వై) పథకం ద్వారా సబ్సిడీ క్రింద మంజూరు అయిన రూ:21,62,910/- విలువ కలిగిన చేపల రవాణా వాహనాన్ని శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు శుక్రవారం వినుకొండలో లబ్ధిదారుడు ఈపూరు మండలానికి చెందిన బొనగిరి నాగరాజు కి అందజేశారు. ఈ సంధర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయనీ, వీరిని దృష్టిలో ఉంచుకుని మత్స్యకారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకం ప్రారంభించిందని, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పి.యం.యం.యస్. వై) అమలు చేస్తుందని అన్నారు. దీనిలో భాగంగానే ఈ పథకం ద్వారా 60% కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీతో మంజూరు అయిన చేపల రవాణా వాహనాన్ని లబ్ధిదారునికి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రాజుపాలెం : రాజుపాలెం గ్రామంలో ఎండిఓ ఆఫీస్ లో ఎస్సీ ఎస్టీ రైతులకు దళిత బహుజన రిసోర్స్ అండ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది ఈ సమావేశమునకు ఏరియా కోఆర్డినేటర్ గద్ది పర్తి కోటి రత్నం ఈ సమావేశం నిర్వహించారు ఎస్సీ ఎస్టీ రైతులను ఉద్దేశించి ప్రతి ఒక్క ఎస్సీ ఎస్టీ రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి సబ్సిడీపై ఏ విత్తనాలు ఇస్తున్నారు ఎరువులు పురుగుమందులు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలన్నారు మనము ఏ పంట వేయాలి ఏ మందులు వేయాలి అనే విషయాలను అడిగి తెలుసుకోవాలన్నారు

ఈ కార్యక్రమంలో ఏపీవో సిహెచ్ వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ రైతులు ఉపాధి హామీ పథకం నుండి వచ్చే పథకాలను ఉపయోగించుకోవాలన్నారు హార్టికల్చర్ కు సంబంధించి జామ మామిడి మునగా మొదలైన పంటలు వేసుకోవాలన్నారు ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని తెలియజేశారు మాట్లాడుతూ టి ఏ అల్లా బక్ష మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలు తప్పనిసరిగా ఉపాధి హామీ పనులకు వెళ్లాలని ఎస్సీ ఎస్టీ రైతులకు భూమి ఉంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈసీ సిహెచ్ హరిత మరియు బిఎఫ్టీ లక్ష్మీ మండల స్థాయి ఎస్సీ ఎస్టీ రైతులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని అన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

సుంకం లేకుంటే తాగునీరు లేనట్లేనా?

విశాలాంధ్ర-రాజుపాలెం : రాజుపాలెం మండల పరిధిలోని ప్రజలకు ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించాలని చేపట్టిన రక్షిత తాగునీటి సరఫరా పథకాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఆయా గ్రామాలలో మంచినీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంక్‌లు దిష్టి బొమ్మలా దర్శనమిస్తున్నాయి. 18 ఎకరాలలో 400.00 లక్షల రూపాయలు వెచ్చించి చెరువు తీసి ఒక మంచి నీటి ట్యాంక్ పంపు హౌస్ నిర్మాణం చేపట్టాన విషయం పాఠకులకు విదితమే. రాజుపాలెం మండలంలోని అనుచులవారిపాలెం, కోటనెమిలి పూరి గ్రామ శివారులో తమ వ్యవసాయ పొలాలను ప్రజలందరి శ్రేయస్సు కోసం పంట పొలం సైతం ప్రభుత్వానికి అందించారు. ఆ చెరువు నిండితే ఎగువ వ్యవసాయ రైతులు సైతం తమ వ్యవసాయ బోరు బావుల్లో నీరు పెరిగి తమ భూములు పచ్చగా మారుతాయని ఎంతో సంతోషించారు. నీటి పంపిణీలోనూ అధికారులు నిర్లక్ష్యం చోటుచేసుకోవడంతో చెరువు కరువుకు చిరునామాగా మారింది. కోట నెమలిపురి, అంచులవారి పాలెం, అనుపాలెం, నెమలిపురి ,శ్రీనివాస నగర్, గ్రామస్తులు తాగునీరు సదుపాయం లేక ఆయా గ్రామాల ప్రజలు తాగునీరు కోసం రోజు నిత్యం వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తు నీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలలో 20 లీటర్ల క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రజల తాగునీటి సౌకర్యార్థం గ్రామాల ప్రజల తాగునీటి పథకాల పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికి వీసమెత్తు ఫలితం ఇవ్వడం లేదు మండలంలోని 16 పంచాయతీలలో నూటికి 80శాతం గ్రామాలలో సురక్షిత మంచినీరు అందుబాటులో లేదని గ్రామాల్లో నేటికీ వాటర్ ప్లాంట్ మీద ఆధారపడి ఉన్నదని కేవలం 28శాతం గ్రామాల్లో మాత్రమే బోర్ పంపులు ద్వారా మంచినీళ్లు తాగుతున్నారని గ్రామాల్లో తెలుపుతున్నారు, కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినప్పటికీ ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయలు డబ్బులు వృధా అవుతుంది. గ్రామాలకు నీళ్లు అందించే విషయంలో పూర్తి వైఫల్యం చెందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్పందించి మంచి నీటి పథకాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చుక్కల భూములకు హక్కు పత్రాలు: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ నుంచి 18,799 ఎకరాల చుక్కల భూములకు యాజమాన్య హక్కు పత్రాలు వచ్చాయని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేట తెలిపారు. శుక్రవారం నెల్లూరు జిల్లా కావలి నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చుక్కల భూములకు సంపూర్ణ హక్కును కల్పించే కార్యక్రమం ప్రత్యేక ప్రసారంను కలక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌లు వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 10,885 సర్వే నంబర్ల ద్వారా నమోదు అయిన 48,147 ఎకరాలకు యజమానులను గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. నిషేదిత 22-ఎ చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం 9.253 కుటుంబాలకు లబ్ధి కలిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-రాజుపాలెం: అర్హత ఉంటే పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు అన్నారు. రాజుపాలెం మండలం పెద్ద నెమలిపురి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలో చేరిన పలువురిని ఆయన పార్టీ కండువా కప్పి స్వయంగా స్వాగతం తెలిపారు ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు ముందుగా గుత్త వెంకట్రావు, గుత్త లక్ష్మీనారాయణ, గాలి శ్రీనివాసరావు, కొత్తపల్లి సత్య న్నారాయణలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, జడ్పిటిసి సభ్యురాలు దొంతి రెడ్డి సునీతారెడ్డి, నాయకులు మర్రి సుబ్బారెడ్డి, బాసు లింగారెడ్డి, జెసిఎస్ మండల ఇన్చార్జి పులిబండ్ల అశోక్, స్థానిక ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు ఉన్నారు.

ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర-నరసరావు పేట: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఐగ్రో అంతర్జాతీయ పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల చైర్మన్ పల్లబోతుల వెంకట్ తెలిపారు. కె.మహేష్ కుమార్ 565 మార్కులు, కె.వర్షిత 525, విడ దల అభినయ సాయి 522 మార్కులతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు, సిబ్బం దికి అభినందనలు తెలియజేశారు. పాఠశాల వైస్ చైర్మన్ పల్లబోతుల మురళీ మాట్లాడుతూ విద్యార్థుల మీద ఎటువంటి ఒత్తిడి పెట్టకుండా సరళమైన విధానాలతో బోధించి తాము ఈ ఫలితాలను సాధించామన్నారు. ఈ క్రమంలో తమకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినంద నలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ దీవి శేషశాయి మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి బోధించిన టీచర్లకు అభినందనలు తెలియజేశారు.

కోలగుట్లలో గ్రామోదయం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని కోలగుట్ల గ్రామంలో శుక్రవారం ఉదయం గ్రామో దయం కార్యక్రమంలో భాగంగా ట్రాన్సెట్ వాక్ నిర్వహించారు. గ్రామంలో మండల బృందం పర్యటించారు. వికలాంగుల పెన్షన్ రావడం లేదని బాధితుడు చెప్పగా వెల్ఫేర్ అసిస్టెంట్‌కు తహశీల్దార్ రమేష్ కుమార్ తగు సూచనలు చేశారు. వీ లవ్ రీడింగ్‌లో మీ పిల్లలకు పుస్తకాలు ఇచ్చరా... ఇస్తే ఎలా చదువుతున్నారని పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. మంచంలో ఉన్న వికలాంగుల ఇంటికి వెళ్ళి మీకు సకాలంలో మందులు ఇస్తున్నారా, డాక్టర్ వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం నుంచి పోషక పదార్థాలు ఇస్తున్నారా, అవి తింటున్నారా లేదా అని గర్భిణీలను అడిగి తెలుసుకున్నారు. నాడు -నేడు పనులను పరిశీలించి, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్దకు చేరుకుని క్లాప్ మిత్ర సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి జీ.ఎల్ఎన్ గుప్తా, ఎతులు వెలుగొండారెడ్డి, ఎస్తేరు రాణి, రాంబాబు, ఎపిఓ. వెంకటేశ్వర్లు, వీఆర్వో రత్నప్రకాష్, సాంబశివరావు, సర్పంచ్ మద్దికర మహాలక్ష్మీవమ్మ, శ్రీనివాసరెడ్డి, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాలేమర్రులో గొర్రెలు, మేకలు మృతి

విశాలాంధ్ర-క్రోసూరు : విద్యుత్ ఘాతానికి గురై మండలంలోని బాలేమర్రు గ్రామంలో 62 గొర్రెలు, రెండు మేకలు మరణించాయి. గురువారం అర్ధరాత్రి వీచిన గాలులకు 11 కేవీ విద్యుత్తు లైను తెగిపడడంతో గొర్రెలు మరణించాయి. గొర్రెలు కాయడం ద్వారా జీవనోపాధిని సాగిస్తున్న రైతు కుటుంబాలను స్థానిక శాసనసభ్యులు నంబూరు శంకర్రావు పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులను పిలిపించి మాట్లాడారు. గొర్రెలు నష్టపోయిన వారికి తగిన నష్ట పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని వాడుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు కార్యాలయమును సంప్రదించి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలంటే తగిన సూచనలు, సలహాలు పొందగలరని సూచించారు.

గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : కౌలు రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, ఈ కార్డుల ద్వారానే పంట కొనుగోలు, ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమా, రైతు భరోసా వంటి పథకాలు కౌలు రైతులకు వర్తిస్తాయని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో శుక్రవారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం అయ్యేందుకు అవగాహన కార్యక్రమాన్ని సొసైటి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంటల సేవా పథకం, పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, చిరు ధాన్యాల సాగు, భూసార పరీక్షల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు తనకు ఉన్న పొలంలో వ్యవసాయ శాఖ అధికారులతో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. రైతులందరూ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రైతు భరోసా కేంద్రాలు, అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, తుమాటి కబ్బారావు, ముంద్రు రాఘవరావు, సాదినేని చిన్న వెంకయ్య, సూరాబత్తుని కృష్ణారావు, రైతులు, ఎఈఓ పూరేటి ఆశోక, వివిఎ హరిబాబు, అనూష పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న టాటా ఏసీ

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్‌లో దావూద్ హోటల్ ఎదురు శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో టాటా ఏసీ 10 చక్రాలు లారీని వెనకనుంచి ఢీకొన్న ప్రమాదంలో టాటా ఏసీ ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా డ్రైవర్ పి శివశంకర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. టాటా ఏసీ వాహనంతో వస్తున్న శివశంకర్ దావూద్ హోటల్ ఎదురు వెళుతున్న లారీ ఒక్కసారిగా ఆగటంతో టాటా ఏసీ అదుపు తప్పి ఢీ కొట్టింది దీంతో టాటా ఏసీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ పి శివశంకర్ ఎడమ కాలు తీవ్ర గాయం కాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిం చారు స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు టాటా ఏసీ గుంటూరు నుంచి వినుకొండ వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

విజ్ఞానార్జనకు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-పర్చూరు: చిన్నారులు విజ్ఞానార్జనకు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథపాలకుడు గుడిపాటి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటులో భాగంగా శుక్రవారం కథలు చదవటం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు గ్రంథాలయాలలో ఉండేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, గ్రంథాలయాలు విజ్ఞానంతోపాటు సంరక్షణగా ఉంటాయని, ప్రమాదాల నివారణకు దోహదపడతాయని తెలిపారు.

14 నుంచి టీ20 ప్రారంభం

విశాలాంధ్ర-పర్చూరు: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఏలూరి యూత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్చూరులోని ఆర్‌సీఏ క్రికెట్ ప్రాంగణంలో ఆల్ ఇండియా స్థాయి టీ20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, ఆర్గనైజర్ తులసి శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.3 లక్షలు, తృతీయ బహుమతి రూ.2 లక్షలు, నాల్గవ బహుమతి రూ.లక్ష అందిస్తారని వారు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు కోదూరి శేషబ్రహ్మాచారి, ఏవీ కృష్ణ, మానం హరిబాబు, మామిడిపాక హరిప్రసాద్, కాపు రవి, షేక్ హుస్సేన్, శ్రీరాం వెంకటసుబ్బారావు, షేక్ బషీర్, ప్రభుదాసు ఉన్నారు.

ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి : ఈపంట నమోదుతో సంబంధం లేకుండా ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జె.పంగులూరు లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తేమ శాతంతో నిమిత్తం లేకుండా తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్‌తో చరవాణితో మాట్లాడుతూ మొక్కజొన్న నమోదు గడువు పెంచాలని, తేమశాతంతో సంబంధం లేకుండా మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేపట్టి గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు.

గుడి నిర్మాణానికి ఇటుకలు వితరణ

విశాలాంధ్ర-అద్దంకి ; సింగరకొండ వద్ద నిర్మితమవుతున్న 72 అడుగుల శ్రీరామనామ స్థూపం గర్భగుడి నిర్మాణానికి అద్దంకి పట్టణానికి చెందిన మాదాల వెంకటేశ్వర్లు శుక్రవారం రూ.30వేల విలువైన ఇటుకలను వితరణ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో శ్రీరమ్మ ఫౌండేషన్ చైర్మన్ స్వర్ణ వెంకటసుబ్బారావు,అన్నపూర్ణ దంపతుల సారథ్యంలో శ్రీరామనామ స్థూపం నిర్మాణం జరుగుతున్నది. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - చీరాల : వేసవి శిక్షణా తరగతులలో భాగంగా చీరాల శాఖాగ్రంథాలయంలో ముందుగా పిల్లలతో కథలపుస్తకాలను చదివించి వారిచేత మరల కథలు చెప్పించామని గ్రంథ పాలకురాలు ధనమ్మ అన్నారు. సోర్స్ పర్సన్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ జనరల్ నాలెడ్జ్, పొడుపు కథలు రాసే విధానమును, చక్కని తెలుగు ఎలా మాట్లాడాలి మొదలగు విషయాల గురించి చెప్పారు. అనంతరం పిల్లలకు లోడో, క్యారమ్స్, చెస్ కాంపిటేషన్ నిర్వహించి గెలుపొందినవారికి ఆదివారం బహుమతులు ఇస్తామని తెలిపారు.

ప్రైవేటు కార్యక్రమంలో ఎమ్మెల్యే గొట్టిపాటి

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పర్యటించారు. ఎమ్మెల్యే పలు శుభకార్యాలకు హాజ రయ్యారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించారు. మిన్నెకల్లులోని గూడూరి చిన్న వెంకటేశ్వర్లు, మంగమ్మ దంపతుల కుమారుడు సురేష్ వివాహం సందర్భంగా నూతన వరునికి ఆశీస్సులు తెలిపారు. అదే గ్రామంలో ఇటీవల ముప్పాళ్ల వేణుబాబు కాలికి, పాలెపోగు అంజయ్య చేతికి శస్త్రచికిత్సలు చేయించుకుని ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం పత్తేపురం గ్రామంలో అయినాల రాజారత్నం, రత్నకుమారి దంపతుల కుమారుడు సాయిసతీష్ వివాహం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి అదవిపాలెంలో పల్లకి వెంకట కోటిరెడ్డి, అనురాధ (లేటు)ల కుమారుడు వెంకట కృష్ణారెడ్డి పెళ్లి పురస్కరించుకొని గొట్టిపాటి నూతన వరుడిని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

కమతం శృతికి డాక్టరేట్

విశాలాంధ్ర - రేపల్లె : బయోటెక్నాలజీ విభాగంలో రేపల్లె మండలం పిరాటలంక గ్రామానికి చెందిన కమతం శృతికి ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆచార్య కె కస్తూరి పర్యవేక్షణలో మెరైన్ నోకార్డియోప్సిస్ డాసన్‌విల్లి కె ఎస్ బి-5 నుండి వేరుచేయబడిన బయోయాక్టివ్ సమ్మేళనాల యాంటీమైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ మరియు సైటోటాక్సిక్ కార్యకలాపాల అంశంపై శృతి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. యస్.కె.డి యూనివర్సిటీకి చెందిన ఆచార్య డి.సురేష్ కుమార్ ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్ శృతి పరిశోధన ఫలితాలపై సంతృప్తి చెంది డాక్టరేట్‌ను శృతికి అందించారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నలజీ విభాగాధిపతి కృష్ణసత్య సైన్స్ జీన్ అండ్ బి.వి.ఎస్ ఛైర్ పర్సన్ సింహాచలం. శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

బాపట్ల డీఎస్పీని కలిసిన సీఐ, ఎస్సై



విశాలాంధ్ర - సంతమాగులూరు : బాపట్ల సబ్ డివిజన్‌కి నూతన డీఎస్పీగా వెంకటేశ్వర్లు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సంతమాగులూరు సర్కిల్ సీఐ బి.ప్రభాకర్, సంతమాగులూరు పీఎస్ ఎస్సై ఎం.వి.శివకుమార్ మర్యాద పూర్వకంగా డీఎస్పీని కలిసి.. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలు, చర్యలు గురించి సీఐ, ఎస్సైలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని డీఎస్పీ వారికి సూచించినట్లు పేర్కొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు: సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతులను నొక్కాలని జీవో నెం.1ను హైకోర్టు రద్దు చేయటం వైసీపీ సర్కార్‌కు చెంపపెట్టని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. శుక్రవారం సింగరకొండ మీడియాతో మాట్లాడుతూ రోడ్లపై బహిరంగ సభలను నిషేధించటం ద్వారా ప్రతిపక్ష పార్టీలు, రాజకీయ సంఘాల నోరు మూయించేలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యల పట్ల నినదించే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని సింగరకొండ తెలిపారు. ప్రభుత్వ ఆంక్షల ఫలితంగా ఉద్యమాలు నిర్వీర్యం అవుతున్న తరుణంలో జీవోనెం.1 విషయంలో కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఇప్పటికైన సీఎం జగన్ ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడకుండా ప్రజా ప్రయోజన విధానాలను అవలంభించాలని సింగరకొండ కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ప్రజలందరి తరుపున సాధించిన విజయమని సింరకొండ తెలిపారు.

జీవోనెం.1 రద్దు హర్షణీయం: జేబీ శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : జీవో నెం.1ను హైకోర్టు రద్దు చేస్తూ తీర్పు ఇవ్వటం హర్షణీయమని సీపీఐ జిల్లా సీని యర్ నాయ కులు జేబీ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ఏఐటీయూసీ ప్రధాన కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ, ముఠా నాయకులు జీవో నెం.1 రద్దు చేయటంతో మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా జేబీ శ్రీధర్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన మొదలైందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజ్యాంగాన్ని ఇష్టానుసారం మార్చు కుంటూ విలువలు లేకుండా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ప్రజల పక్షాన జగన్ చేస్తున్న దుర్మార్గపు పాలనను బయటపెట్టి ప్రజలకు గొంతు నొక్కే జీవో నం 1 ను హైకోర్టు రద్దు చేయడం శభపరిణామమన్నారు. హైకోర్టు జీవో నెం.1 ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే విధంగా ఉందని అభిప్రాయడి కొట్టివేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు నిర్వహించే సభలు సమావేశాలలో తొక్కిసలాటలు జరగటానికి కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల జరిగిన ప్రాణనష్టమని శ్రీధర్ తెలిపారు. ఇటువంటి జీవోలను రద్దు చేసి ప్రజల అభిప్రాయాలను విలువలతో ప్రభుత్వం స్వీకరించాలని శ్రీధర్ అన్నారు. అనంతరం జీవో నెం 1 పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ సిపిఐ పార్టీ నాయకులు, ఏఐఎస్ఎఫ్ యువ నాయకుడు మామిడి బత్తుల గణేష్, ఏఐటియుసి నాయకులు మామిడి బత్తుల అశోక్, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

చుక్కల భూముల రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు

- జిల్లాలో 7,833.87 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి విముక్తి
- భూపత్రాలు పంపిణీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - బాపట్ల : నిషేధిత భూముల జాబితా నుంచి వందేళ్ల తర్వాత రైతుల భూములకు శాశ్వతంగా విముక్తి కలిగిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. చుక్కల భూముల రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశంలో జరిగింది. రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని కావలి పట్టణంలో ముఖ్యమంత్రి ప్రారంభించగా రైతులు తిలకించేలా అధికారులు ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. తదుపరి జిల్లాలోని లబ్ధిదారులైన రైతులకు ఏపీ లెజిస్లేటివ్ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో కలిసి హక్కు పత్రాలను పంపిణీ చేశారు. చుక్కల భూముల జాబితాలో వందేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 3,514 సర్వే నెంబర్లలోని 7,833.87 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించామన్నారు. బాపట్లలో 4,257 రైతు కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. బ్రిటిష్ కాలం నుంచి చుక్కల భూమి ఎవరిదో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వానికి చెందినవా,... ప్రైవేట్ వ్యక్తుల భూములా అనే విషయంలో సందిగ్ధత నెలకొందన్నారు. రైతుల సమస్యలను గుర్తించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చట్టాన్ని తెచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలతో రైతుల సమస్యలన్నీ ఇక శాశ్వతంగా పరిష్కారమయ్యాయన్నారు. రైతుల భూ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ శాశ్వతంగా పరిష్కరించారని ఏపీ లెజిస్లేటివ్ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో సీఎం గొప్ప నిర్ణయాలు తీసుకున్నారని కితాబిచ్చారు. తరతరాలుగా వందేళ్ల అనుబంధంతో సాగు చేస్తున్న కుటుం బాలకు ఆ భూములపై హక్కు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల పక్షాన నిలిచిన ముఖ్య మంత్రి ఎలాగైనా మేలు చేయాలని ఆత్మస్థైర్యంతో చట్టాన్ని అమలులోకి తెచ్చారన్నారు. సాగు చేస్తున్న భూములకు శాశ్వత హక్కు కల్పించడం అభినందనీయ మన్నారు. ఇలాంటి గొప్ప నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి రైతులంతా రుణపడి ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిని కె.లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏవో సుశీల, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లు, చర్యలు గురించి శుక్రవారం పోలీసు అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతం, ముఖ్యమంత్రి ప్రసంగించే సభా వేదిక నిర్మాణం, మీటింగ్ ప్లేస్ లో గ్యాంగ్ వేలు, బారిగెడ్లు ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, కాన్వాయ్ వెళ్ళు మార్గంలో, సభా ప్రాంగణంలో, ప్రవేశ మార్గాలలో, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాల ఏర్పాట్ల గురించి మరియు ఇతర భద్రత పరమైన ఏర్పాట్ల గురించి జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో సమీక్షించారు.ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ముఖ్యమైన ప్రదేశాలలో జరుగుతున్న పనులను పర్యవేక్షించడానికి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులను జిల్లా ఎస్పీ నియమించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు, పోలీస్ సిబ్బందికి మంచినీరు నిరంతరం అందే విధంగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సభా ప్రాంగణం నుండి హెలిపాడ్ వరకు స్వయంగా కాలినడకన జిల్లా ఎస్పీ పర్యటించి సభా ప్రాంగణాన్ని, హెలిపాడ్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని, పార్కింగ్ ప్రదేశాలను, సీఎం కాన్వాయ్ వెళ్ళు మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఎస్పీ గారితో రేపల్లె డి.ఎస్.పి టి.మురళీకృష్ణ, ఏ ఆర్ డి.ఎస్.పి ఎమ్.డి.హెచ్ ప్రేమ్ కుమార్, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, రేపల్లె రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ.శివశంకర్, రేపల్లె సిఐ ఎస్.విజయచంద్ర, వేమూరు సిఐ వెంకటేశ్వరరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలను ఆదు కోవాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి వెళ్ళరాదంటూ పోలీసుల అక్రమ అరెస్టులను సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో కొలుకోలేని విధంగా అన్నదాతలు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు తడచిన పరిధాన్యం, పసుపు, మొక్కజొన్న, తెల్లజొన్న, మిర్చి తదితర పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించావని కోరుతూ సిఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తే గురువారం రాత్రి భట్టిప్రోలు పోలీసులు సిపిఐ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టుముక్క బాలాజీ, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, విష్ణు మొలకల శ్రీనివాసరావులకు ముందస్తు నోటీసులను జారీ చేసి గృహ నిర్బంధం చేసి సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే రైతును ఆదుకోవాలని లేకుంటే దశలవారి ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలతో దళారులకు చెక్

విశాలాంధ్ర - బల్లికురవ : రైతుల పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంతో పాటు దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం ముక్తేశ్వరం గ్రామంలో ఏపీ మార్క్ఫె ఫెడ్ మరియు నాఫెడ్ వారు సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా పేరయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అందులో భాగంగానే రైతులు పండించిన పంటకు ప్రభుత్వమే మద్దతు ధర కల్పిస్తూ ఏపీ మార్క్ ఫేడ్ మరియు నాఫెడ్ ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ పంటలో నమోదు చేసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర 1962 రూపాయలకు మొక్కజొన్న విత్తనాలను అమ్ముకోవచ్చు అన్నారు.రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి,తేమ శాతం 14 శాతం కంటే తక్కువగా ఉండాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్వీపి కుమారి, కొమ్మినేని వారిపాలెం సొసైటీ అధ్యక్షుడు దరిశి రామకృష్ణయ్య, బల్లికురవ సొసైటీ అధ్యక్షుడు గుర్రం రంగారావు, ముక్తేశ్వరం గ్రామ సర్పంచి మసిముక్కల లక్ష్మీ వెంకటేశ్వర్లు, దివ్య రామాంజనేయులు, శివారెడ్డి, సుబ్బారావు, సొసైటీ సిబ్బంది,వివిఎ రోజా, రైతులు పాల్గొన్నారు.

జీవో 1 కొట్టివేతపై సీపీఐ హర్షం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఉద్యమాల అణచివేతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1ని ఏపీ హైకోర్టు కొట్టివేయడంపై సంతమాగులూరు సీపీఐ మండల శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై రోడ్లపై నినదించే ప్రజాసంఘాలు, ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. ప్రాథమిక హక్కులకు విఘాతంగా ఉందన్న సాక్షాత్తూ హైకోర్టు పేర్కొనడంతో ప్రభుత్వానికి చెంపపెట్టుగా మారిందని వారు తెలిపారు. ఈ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. సంతమాగులూరు మండల సహాయ కార్యదర్శి షేక్. కాలేషాగారి ఖాదర్ బాషా ఆధ్వర్యంలో గత సంక్రాంతి పండుగ భోగి నాడు మంటలలో ప్రతులను తగలబెట్టి నిరసన తెలియజేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు పోరాటాలు ఫలితంగానే జీవో రద్దు అయినట్లు ఆయన అన్నారు. రాష్ట్రంలో సభలు, రోడ్ షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ జీవో నెం.1ను తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వంపై సీపీఐ నేత రామకృష్ణ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ రోడ్ షోలను కట్టడి చేసేలా జీవో ఉందని పిటిషన్ల తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. అంతేకాకుండా పోలీస్ యాక్ట్ 30కు భిన్నంగా జీవో నెం.1 జారీ చేశారని న్యాయవాది న్యాయస్థానం ఎదుట పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి హైకోర్టు తుదితీర్పును వెలువరించింది. ఆయనతో పాటు సీపీఐ మండల శాఖ కార్యదర్శి మల్లెల ఏసోబు, నేతలు అద్దంకి నాగేశ్వరరావు, నక్కా ఆంజనేయులు, మొగిలి వెంకటేశ్వర్లు, చీతిరాల కొండయ్య, చింతలయ్య, షంషూన్ బీ, మార్తమ్మ తదితరులు ఉన్నారు.

గిరిజన విద్యా వ్యవస్థ కుదేలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జగన్‌రెడ్డి పాలనలో గిరిజన విద్యావ్యవస్థ కుదేలు అవుతుందని బాపట్ల పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం బాపట్ల పట్టణంలోని స్థానిక జమ్ములపాలెం ఫ్లైఓవర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఎస్.టి సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. చుక్కా పాలరాజ్, బాలిగ శ్రీనివాసరావు, ఇండ్ల శ్రీనివాసరావు, నంబూరి ఏడుకొండలు, మహిమరాజు, పాల్గొన్నారు.

మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారం

విశాలాంధ్ర - కొల్లూరు : ఒంటరిగా ఆటో ఎక్కిన మహిళపై ఆటో డ్రైవర్ దారుణంగా అత్యాచారానికి పాల్పడిన సంఘటన కొల్లూరు మండలపరిధిలోని మొసలిపాడు పంటపొలాల్లో చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన అవివాహిత మహిళ తన తల్లిదండ్రులతో ఉంటూ కుట్టుపని చేసుకుంటూ కుటుంభ పోషణ చేస్తుంది. గురువారం చిలకలూరిపేట తెలిసిన వారి ఇంటి ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో రాత్రి 9.30 ప్రాంతంలో తెనాలి చేరుకుంది. ఆసమయంలో బస్సులు లేకపోవడంతో తెనాలి నుంచి కొల్లూరు వచ్చేందుకు ఆటోని ఆశ్రయించింది. ఆటో ఎక్కిన అనంతరం తన గ్రామంలో తనకు తెలిసిన వ్యక్తులకు ఫోన్ చేసి ఆటోలో వస్తున్నట్లు సమాచారం అందించడంతోపాటు, ఆటో డ్రైవర్ ప్రవర్తనపై అనుమానంతో ఫోన్ కట్‌చేయకుండా లైన్‌లోనే ఉంచింది. మండలంలోని మొసలిపాడు వద్దకు చేరుకునే సరికి ఆటో డ్రైవర్ అకస్మాత్తుగా ఆటోని పంట పొలాల్లోకి తిప్పడంతో ఆందోళనకు గురై ఆటోలోంచి కిందకు దూకింది. ఆటో డ్రైవర్ సైతం కిందకు దూకి బాధితురాలి జుట్టుపట్టుకుని పొలాల్లోకి లాక్కెళ్లి ఆమెపై దాడికి పాల్పడి ఘాతుకానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫోన్ కట్‌చేయకపోవడంతో అనుమానం వచ్చిన ఆమెకు తెలిసిన వ్యక్తి ఫోన్ వింటూ ఉండగా అకస్మాత్తుగా తనను ఏమి చేయవద్దని, వదలాలని మహిళ అరుస్తుండటం విని తమ గ్రామం నుంచి తమ నివాసం సమీపంలో ఉన్న వ్యక్తులతో కలసి మహిళను వెతుక్కుంటూ వెళ్లారు. పలు చోట్ల గాలించిన అనంతరం మొసలిపాడు వద్ద పొలాల అంచున ఆటో ఆగి ఉండటం గమనించి అరుచుకుంటూ పొలాల్లోకి వెళ్లడంతో అత్యాచారానికి పాల్పడిన నింధితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. అక్కడకు వెళ్లిన వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రాజీవ్‌శామ్యూల్‌కుమార్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని బాధితురాలిని పోలీసు స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు సేకరించారు. నింధితుడు సంఘటనా ప్రాంతంలో వదిలి వెళ్లిన ఆటో, ఆటో తాళంకున్న కిచైన్‌పై ఉన్న ఫోటో ఆధారంగా తెనాలికి చెందిన మొగిలి గోపాలకృష్ణ ఉరఫ్ వాసుగా గుర్తించి ఎస్ఐ సిబ్బందితో కలసి తెనాలి వెళ్లి చంద్రబాబునాయుడు కాలనీలోని బందువుల ఇంట్లో ఉన్న నింధితుడ్ని అదుపులోకి తీసుకుని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాధితురాలిని శుక్రవారం వైద్యపరీక్షల నిమిత్తం తెనాలి ప్రభుత్వవైద్యశాలకు తరలించిన పోలీసులు, నింధితుడితోపాటు, బాధితురాలిని, ఆమెను రక్షించేందుకు వెళ్లిన యువకులను విచారించే పనిలో నిమగ్నమయ్యారు. వేమూరు సీఐ వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు

నేడు బాపట్ల పట్టణంలో విద్యుత్ కోత

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పట్టణంలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్ పట్టణ ఏఈ పెరుగు శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

యాతం సౌజన్యకు యూట్యూబ్ సిల్వర్ అవార్డు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల మండలం ఆసోదివారిపాలెం ఎంపీపీ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాతం సౌజన్యకు యూట్యూబ్ క్రియేటర్ సిల్వర్ అవార్డును సాధించారు. తన సౌజన్య టిఎల్ఎం యూట్యూబ్ ఛానల్ కు ఒక లక్ష , నలభై వేల మంది సబ్స్క్రైబర్స్ ఉన్నందున యూట్యూబ్ ఛానల్ వారు సౌజన్యకు యూట్యూబ్ క్రియేటర్ సిల్వర్ బటన్ అవార్డుకు ఎంపిక చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు జల్దీ భాగ్య శ్రీధర్ అన్నారు.శుక్రవారం మండలంలోని పిట్టువారిపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించి పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్ళించి కార్మికుల బతుకులను వీధి పాలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

వైసీపీ ప్రభుత్వానికి హైకోర్టు షాక్

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కి కట్టడి చేయాలన్న ఆలోచనలో భాగంగా ప్రవేశ పెట్టిన జీవో నెంబర్ ఒకటి,పోలీస్ 30 యాక్ట్‌కు బిన్నంగా ఉందని రాష్ట్ర హైకోర్టు జీవో నెం.1 సస్పెండ్ చేస్తూ రద్దు చేయడం సీపీఐ సాధించిన విజయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఏపీ హైకోర్టులో జీఓ నంబర్ ఒకటి సస్పెండ్ చేసిన సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొద్ది కాలం క్రిందట జీవో నెం.1 విడుదల చేసి రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు ఎవరైనా రోడ్ షోలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు రోడ్డు ప్రక్కన జరపడానికి వీలులేదని జీవోను విడుదల చేశారన్నారు.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకి వ్యతిరేకంగా ఆనాడే సీపీఐ రాష్ట్ర సమితి ఈ జీవో నెం.1 రద్దు చేయాలని ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి ఆనాటి నుండి భారత కమ్యూనిస్టు పార్టీ ,ఇతర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు అన్ని కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి చేస్తూ నిరసనలు, ధర్నాలు చేశాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవేళ సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆలోచన చేస్తే సుప్రీంకోర్టులో కూడా సీపీఐ కెవిఎట్ పిటిషన్ వేయడానికి సిద్ధంగా ఉందని ఈ విషయంలో వెనుకాడే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు,ఎ్ాన్నారావు, దామర్ల యోగ చలం తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రైతులకు మద్దతుగా పాదయాత్ర

విశాలాంధ్ర - రేపల్లే : రాజధాని రైతులకు మద్దతుగా ఈనెల 13న ఉదయం 9 గంటలకు అమరావతిలోని తుళ్లూరు నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం వరకు మాజీ న్యాయమూర్తి జై భీమ్ భారత్ పార్టీ అధినేత జడా శ్రావణ్ కుమార్ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంజీ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు 32 శాతం మంది రాజధానికి భూములు ఇచ్చినారని నేడు ఆర్ 5 జోన్ ఏర్పాటుతో తమకున్న కొద్దిపాటి భూములను రాజధానికి కేటాయించిన ఆ వర్గాలకు చెందిన సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఎస్సీ ఎస్టీ రైతుల పక్షాన సుప్రీంకోర్టులో జడ శ్రావణ్ కుమార్ పిటిషన్ దాఖలు చేసి ఎస్సీ ఎస్టీ రైతుల తరపున వాదనలను వినాలని కోరిన విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. రాజధాని ప్రాంతంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల రైతులకు న్యాయం జరిగే వరకూ వారికి అండగా జై భీమ్ భారత పార్టీ రాజీ లేని పోరాటాలకు సిద్దపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు నెరుసు వెంకటరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవోలు మానుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : జీఓ1 పై హైకోర్టు ఇచ్చిన తీర్పుకు చీరాల టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 75 మంది సలహాదారులను నియమించుకుని ప్రత్యర్థి పార్టీలు ఎటువంటి సభలు రాలీలు నిర్వహించకుండా అర్ధరాత్రి జీఓ నెంబర్ 1 ను తీసుకువచ్చి ప్రభుత్వంపై ఎవరు ప్రశ్నించకుండా చేశారన్నారు. జీఓను హైకోర్ట్ రద్దు చేయాలని తీర్పు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు నిర్వహించు సభలు సమావేశాలలో తొక్కిసలాటలు జరగటానికి కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని,వాటి వల్ల జరిగిన ప్రాణ నష్టం కారణం జగన్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో పులిపాటి శేఖర్,గుంటి మల్లి,పల్లగొర్ల బాల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు 5వ రోజు శుక్రవారం నిర్వహించారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా 30 మంది బాలబాలికలు లైబ్రరీలోని స్వాతంత్ర్య సమర యోధులు జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, కథలు, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను పఠనం చేశారు. లైబ్రరీకి ఎక్కువ మంది పిల్లలు వచ్చేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని లైబ్రరియన్ విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన Piramal Capital & Housing Finance Ltd., Guntur వారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునదిఏమనగా, నాక్లయింటు వద్దకు బాపట్లజిల్లా, చీరాల మున్సిపాలిటీ, డోర్.నెం.19-1-3 కాపురస్తురాలు తవ్వా రమేష్ బాబుగారి భార్య వెంకటలక్ష్మిగారు ది.10-04-2023న దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు విక్రయ బయానా అగ్రిమెంటును 1)సోమిశెట్టి ప్రభావతి, 2) సోమిశెట్టి వెంకట మారుతీ కిరణ్‌కుమార్, 3)గుంపెర్ల నాగాంజలి, 4) కొండూరు భాగ్యలక్ష్మి, 5) రేపాల శ్రీదేవి గార్ల వద్ద నుండి విక్రయ బయానా అగ్రిమెంటు పొందియున్నారు. సదరు ఆస్తి సోమిశెట్టి వెంకటేశ్వర్లుగారు ది.15-04-1981న విక్రయ ద.నెం. 1026/1981గా యస్.ఆర్.ఓ.చీరాల ద్వారా యిస్కాల వెంకట సుబ్బయ్య వగైరాల వద్ద నుండి కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించుచూ మరణించిన దరిమిలా సదరు ఆస్తి పై తెలిపిన సోమిశెట్టి ప్రభావతి వగైరాలకు సంక్రమించి వారు మాత్రమే సర్వ హక్కులతో అనుభవించు చున్నారని అట్టి ఆస్తికి చెందిన విక్రయ దస్తావేజు నెం.1026/1981 యస్.ఆర్.ఓ.చీరాలగల దస్తావేజు పోయినదని, దొరకలేదని చెప్పి తెలిపి సదరు ఆస్తిని తవ్వా వెంకట లక్ష్మిగారికి విక్రయ బయానా అగ్రిమెంటు వ్రాసి విక్రయించుచున్నందున అట్టి ఆస్తి కొనుగోలు నిమిత్తం సదరు వెంకట లక్ష్మిగారు ఋణంకొరకు నాక్లయింటును సంప్రదించి యున్నారు. కావున షెడ్యూలు ఆస్తిపైగానీ, పోయిన దస్తావేజుపై గానీ, మంజూరు చేయుఋణముపైగానీ ఎవరి కైనను ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియ జేయవలెనని గడువు లోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోను మంజూరుచేయబడును మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండు చేయబడవు.

షెడ్యూలు:బాపట్ల జిల్లా, చీరాల స.డి॥, & మున్సిపాలిటీ పాత వార్డు నెం.9, కొత్త వార్డు నెం.15, టి.యస్ నెం.67,చీరాల గ్రామం తాలూకు సర్వేకు నెం.210/14,15ర్లు త.నెం.15-11-15రు అ.నెం.1032005957రు గల పాపరాజుతోట యేరియా లోని చ.గ.160 2/3లు స్థలము అందలి ఇంటికి హద్దులు. **హద్దులు.తూర్పు:**యీ ఆస్తి స్వంత ప్రహరీ గోడ వెంబడి మున్సిపల్ రోడ్డు హద్దు. అ.16-11లు, **దక్షిణం:**యీ ఆస్తి స్వంత ప్రహరీ గోడ వెంబడి మున్సిపల్ రోడ్డు హద్దు అ.81-08లు **పడమర:**యీ ఆస్తి స్వంత ప్రహరీ గోడ వెంబడి మేదూరి కృష్ణమూర్తి గారి ఆస్తి హద్దు అ.16-11లు, **ఉత్తరం:** యీ ఆస్తికి పలివేటి రుక్మాంగధరరావు గారి యింటికి మధ్య గల జాయింటు గోడ హద్దు అ.80-07లు.

M/s.Kotamraju Law Associates,
D.No.87-142/1, Sambasiva Nagar, Lalpuram Road, Chuttugunta, Guntur. Cell :9490343123